క్లుప్తంగా

రాజీనామా

దేవరుప్పుల: మండలంలోని సింగరాజుపల్లికి చెందిన బీఆర్‌ఎస్ యువజన సీనియర్ నాయకుడు, సామాజిక సేవానిరతుడు కొమ్ము సాయి శుక్రవారం ఆ పార్టీకి రాజీనామా చేసినట్టు తెలిపారు. గత కొన్ని సంవత్సరాల నుంచి పార్టీ బలోపేతంతో పాటు ప్రజాప్రతినిధుల ఎన్నికల్లో తన వంతు ప్రభావిత కార్యకమాలతో సేవలిందించినప్పటికీ ఇటీవల పెట్టుబడిదారులకు పార్టీలో పెద్దపీట వేయడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. ఇలాంటి విష సంస్కృని విడనాడి సేవా కార్యక్రమాల ద్వారా తన భవిష్యత్ నిర్ణయం తీసుకుంటానని పేర్కొన్నారు.

కొమ్మూరికి సీపీఐ మద్దతు

జనగామ రూరల్: కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి సీపీఐ తరఫున మద్దతు తెలుపుతూ ఆయన భారీ మెజార్టీతో గెలుపొందేందుకు కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో ఆదిసాయన్న అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాతూరి సుగుణమ్మ, ఆకుల శ్రీనివాస్, సోమయ్య, యాకూబ్, ప్రశాంత్, మల్లేషం, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు వైఎస్సార్‌టీపీ మద్దతు

చిల్పూరు: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సింగపురం ఇందిరకు వైఎస్సార్‌టీపీ పూర్తి మద్దతు ఇస్తుందని పార్టీ ఇన్‌చార్జ్ సంగాల ఈర్మియా తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇందిరను కలిసి మద్దతు తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి



నర్మెట: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, సీఎం కేసీఆర్ బడుగు బలహీణ వర్గాల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని పలుగ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించిన వారు పథకాలను వివరిస్తూ కేసీఆర్‌ను మూడోసారి గెలిపించి హ్యాట్రిక్ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామిని శివరాజ్, సర్పంచ్‌లు ఆమెడపు కమలాకరెడ్డి, బానోత్ శంకర్ నాయక్, విజయ నర్సయ్య, బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు ఎలబోయిన నరేష్ సీనియర్ నాయకులు తదితరుల పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

చిల్పూరు: గుడుంబాను అక్రమంగా రవాణా చేస్తున్న బాదావత్ రవిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ భాస్కర్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన కేసు వివరాలను తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మల్కాపూర్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా యాపల్‌బోల్ తండాకు చెందిన రవి ద్విచక్ర వాహనాన్ని ఆపకుండా వెళ్తుండగా సిబ్బంది వెంటపడి పట్టుకోవడం జరిగిందన్నారు. అతని వద్ద తనిఖీ చేయగా ఆరు లీటర్ల గుడుంబా ఉందని చెప్పారు. ఎస్సై నరేష్, సిబ్బంది శ్రీనివాస్, దస్తగిరి పాల్గొన్నారు.

పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయగా కేవీ వరంగల్

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని కేంద్రీయ విద్యాలయ వరంగల్‌ను పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయగా కేంద్ర విద్యాశాఖ మార్పు చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యూ ఎడ్యుకేషన్-2020 పాలసీలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న 535 కేవీ పాఠశాలలను పీఎం శ్రీ కేవీలుగా రూపాంతరం చేసేందుకు శ్రీకారం చుట్టగా అందులో కేవీ వరంగల్ చోటు దక్కించుకుంది. కేవీ వరంగల్‌ను పీఎం శ్రీ కేవీ వరంగల్‌గా మారుస్తూ శుక్రవారం ఏర్పాటు చేసిన పాఠశాల బోర్డును విద్యార్థులు ఆసక్తిగా గమనించారు. కేవీ వరంగల్‌కు తొలి విడతో రూ.20 లక్షల నిధులను కేంద్రం విడుదల చేసి, కేంద్ర కమిటీ 360 డిగ్రీల్లో డ్రోన్ ద్వారా పాఠశాల అభివృద్ధిపై పర్యవేక్షణ నిర్వహించనున్నట్లు సమాచారం.

గొప్ప దార్శనికుడు మౌలానా అబుల్ కలాం

కేయూ క్యాంపస్: గొప్ప దార్శనికుడు మౌలానా అబుల్ కలాం అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. క్యాంపస్‌లోని మౌలానా అబుల్ కలాం సెంటర్ ఫర్ మైనార్టీస్ ఎంపవర్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కనీజ్‌ఫాతిమా అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మౌలానా అబుల్ కలాం జయంతి (ముందస్తు)సమావేశంలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ లాంటి జాతీయ సంస్థల స్థాపన కలాం చలువేనని గుర్తుచేశారు. విద్యావ్యాప్తి ద్వారా సమాజం చైతన్యం, అభివృద్ధి జరుగుతుందని వివరించారు. దేశంలోనే అక్షరాస్యత శాతం పెరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యను ప్రతీఒక్కరు హక్కుగా భావించాలన్నారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ మహ్మద్ ఇక్బాల్‌అలీ, అధ్యాపకులు పాల్గొన్నారు. తొలుత అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

స్వేచ్ఛగా ఓటు వేయాలి



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

లింగాలఘణపురం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సారథి కళాకారులు శుక్రవారం నెల్లుట్లలో ఆట, పాటలతో ప్రజలను చైతన్యం చేశారు. జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి రాజేంద్రప్రసాద్, స్వీప్ నోడల్ అధికారి వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామ బీఎల్‌ఓల పర్యవేక్షణలో ప్రచారం నిర్వహించారు. మద్యం, డబ్బులకు ఆశపడకుండా ఓటు వేయాలని కోరారు. కళాకారులు గణేష్, సంజీవ, రత్నం, శంకర్, శ్రీనివాసు, కనకరాజు, సోమయ్య, చంద్రశేఖర్, స్వప్న పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘురామకృష్ణ

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో వంద శాతం ఇంటి, నల్లా పన్నులను వసూలు చేయాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ నుంచి జూన్ వరకే వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నది ప్రభుత్వ నిబంధన అన్నారు. కానీ ఇంత వరకు వంద శాతం వసూలు కాలేదన్నారు. ప్రతి రోజు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి పన్నులను వసూలు చేయాలన్నారు. గ్రామస్తులు కూడా స్వచ్ఛందంగా పన్నులు చెల్లించాలని, ఆ పన్నులతో కరెంటు బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐలు, సిబ్బంది వేతనాలు చెల్లించే వీలుంటుందని తెలిపారు. జీపీ రికార్డులను అప్‌డేట్ చేయాలని తెలిపారు. కార్యదర్శులు అనిల్‌రాజ్, భరత్, దేవీ ప్రసాద్, రూపాచైతన్య, నర్సింహులు, కరుణాకర్, రేవతి, కారోబార్లు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు నడపాలి



డీఎంకు వినతి పత్రం అందజేస్తున్న నవీన్

చిల్పూరు: కాలినడకన ప్రభుత్వ పాఠశాలకు వచ్చి చదువుకునే విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు సర్వీసును నడపాలని ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు భీమగోని నవీన్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండ ఆర్టీసీ డీఎం వల్లికార్జున్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వెంకటాద్రిపేట, వడ్డెగూడెం, చిల్పూరుగుట్ట, వెంకటేశ్వరపల్లి విద్యార్థులకు ఈ రూట్‌లో సమయానికి బస్సు సర్వీసు లేకపోవడంతో పాఠశాలకు కాలినడకన వెళ్తున్నారని తెలిపారు. బస్సు సర్వీసు నడపాలని డీఎంను కోరగా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. జానీబాబా, నారగోని నితిన్, నల్ల రంజిత్, రాకేష్, కనుకరాజు, అనీల్, సంతోష్ పాల్గొన్నారు.

అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు



కొమురవెల్లి మండలం కిష్టంపేటలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న పల్లా

- కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదు
- బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కిష్టంపేట, రాంసాగర్, గౌరాయపల్లి, మర్రిముచ్చాల, లెనిన్‌నగర్, కొమురవెల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులకు ఓటు అడిగే హక్కు లేదని.. వారికి అధికారమిస్తే సంక్షేమ పథకాలన్నీ బంద్ అవుతాయన్నారు. సంక్షేమంలో తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించిందని తెలిపారు. జనగామ నియోజకవర్గాన్ని గజ్వేల్, సిద్దిపేట తరహాలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు కరెంట్ కష్టాలు తప్పవన్నారు. జనగామ నియోజకవర్గ అభివృద్ధికి రూ. 60 కోట్ల నిధులు తెచ్చానని, అందులో రూ. 25 కోట్లు గ్రామాల అభివృద్ధికి కేటాయించానని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థికి బీఆర్‌ఎస్ అన్ని అవకాశాలు ఇచ్చిందని, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఊసరవెల్లిలా పార్టీలు మారుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నాడని విమర్శించారు. ఈప్రాంత అభివృద్ధికి అవసరమైన నిధులను ఈనెల 18న చేర్యాలలో జరిగే బహిరంగ సభలో సీఎం కేసీఆర్ చేత మంజూరు చేయించుకుందామన్నారు. ఆశీర్వదించి ఓటు వేస్తే ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన సుమారు 350 మంది బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, జెడ్పీటీసీ సిద్దప్ప, ఎంపీపీ కీర్తన, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, వంగ చంద్రారెడ్డి, పచ్చిమడ్ల స్వామి, కరుణాకర్, పద్మ, కృష్ణారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.



జనగామ: 15వ వార్డులో ప్రచారం చేస్తున్న పల్లా సతీమణి నీలిమ



జనగామ: 20వ వార్డులో ప్రచారం చేస్తున్న నాయకులు

కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలి

జనగామ: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు భరోసా కల్పిస్తున్న కేసీఆర్‌ను మూడో సారి సీఎం చేసేందుకు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ అన్నారు. పట్టణంలోని 15వ వార్డుతో పాటు ఆయా కాలనీల్లో శుక్రవారం ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. వార్డు, పార్టీ మహిళలు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రజలు దీవించి గెలిపిస్తే జనగామను మరింత అభివృద్ధి చేస్తారని చెప్పారు. కాగా, వార్డులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. 20వ వార్డులో కౌన్సిలర్ జూకంటి లక్ష్మీశ్రీశైలం ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్‌చార్జ్ ఆర్.రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, కౌన్సిలర్ మారబోయిన పాండు, ఎండీ మాజీద్, వార్డు అధ్యక్షుడు ఆలేటి రాజు, సాయి చరణ్‌రెడ్డి, లాజర్, యాదగిరి, రాము, మల్లేష్, సాయిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం

బచ్చన్నపేట: బీఆర్‌ఎస్ జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు కోరారు. ఈ మేరకు శుక్రవారం పలు గ్రామాల్లో వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌ను కోరుకుంటున్న ప్రజలు



జనగామలో ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారితో కొమ్మూరి

- బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం
- ఆరు గ్యారంటీ స్కీంలతో ఆర్థిక భరోసా
- పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి



ఇంటింటా ప్రచారం చేస్తున్న కొమ్మూరి కూతురు, మహిళలు



కొమ్మూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీజేపీ మాజీ కౌన్సిలర్ మల్లమ్మ

జనగామ: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని, ప్రజలు కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని పార్టీ జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంతో పాటు 16, 12వ వార్డుల్లో చేరికలు, ప్రచార కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో మా టలు తప్ప, చేతల్లో ఏమీ జరగలేదన్నారు. ఉన్నత చదువులు చదివి ఉపాధి లేక నిరుద్యోగులు, యువకులు రోడ్డున పడ్డారని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయడంలో సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యం, అలసత్వంతో లక్షలాది మంది అభ్యర్థులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని, ఈ పాపం ఊరికే పోదన్నారు. దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం, ప్రజలకు మాయమాటలు చెబుతూ కాలం వెళ్లదీసిందే తప్ప, ఏ ఒక్కరికి న్యాయం చేయలేదని ఆరోపించారు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను గుర్తించిన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ మిగులు బడ్జెట్‌తో ప్రత్యేక రాష్ట్రం ఇస్తే, కేసీఆర్ సర్కారు అప్పుల కుప్పగా మార్చేసిందన్నారు.

అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భరోసా..

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజురోజుకు కాంగ్రెస్‌కు ప్రజల మద్దతు పెరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని 8 మండలాల్లో కాంగ్రెస్ ప్రచారానికి ప్రజల నుంచి స్వచ్ఛందంగా మద్దతు లభించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అధికారంలోకి రాగానే ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు..

పట్టణంలోని 16వ వార్డుకు చెందిన బీజేపీ మాజీ కౌన్సిలర్ కడకంచి మల్లమ్మ, కడకంచి రమేష్ ఆధ్వర్యంలో వందలాది మంది కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రజాపరిపాలన అందిస్తామనే పూర్తి విశ్వాసంతో అనేక మంది స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఈ కార్య క్రమంలో నాయకులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, మేడ శ్రీనివాస్, గాదెపాక రామచందర్, మిద్దపాక స్టాలిన్, శ్యాం, మిద్దపాక ప్రసాద్, తిప్పారపు అనిల్, నాగిళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం..

12వ వార్డు వీవర్స్‌కాలనీలో మహిళా నాయకురాలు శ్రీరాం సంధ్యారాణి, అభ్యర్థి కూతురు సాయి ప్రియాంకరెడ్డి ఆధ్వర్యంలో కొమ్మూరి ప్రతాప్ రెడ్డి గెలుపునకు ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర, మున్సిపల్ కౌన్సిలర్ వంగాల కల్యాణి, కొడం అన్నపూర్ణ, మునిబేగం, కూకట్ల సుజాత, రచ్చ రమ, కాముని స్వప్న, ఎనగందుల అన్నపూర్ణ, కొడం నీలిమ తదితరులు ఉన్నారు.

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు నల్లగోని బాలకిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీ పథకాల కార్డులను ఓటర్లకు అందించి చేతి గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు.

పేదలను మోసం చేస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



మాట్లాడుతున్న దశమంతరెడ్డి

జనగామ రూరల్: పేదలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలని బీజేపీ జనగామ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. శుక్రవారం రెండో సెట్ నామిషన్ దాఖలు నేపథ్యంలో పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. మహిళలు బతుకమ్మలు, బోనాలతో స్వాగతం పలికారు. కార్యకర్తలు గజమాలతో ఆయనను సత్కరించారు. జనగామ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేఈవీఎల్ఎన్‌రెడ్డి, ఉడుగుల రమేష్, సిరికొండ విద్యాసాగర్, కొంతం శ్రీనివాస్, సురేష్ గౌడ్ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభివృద్ధే ధ్యేయం



జనగామ రూరల్: సబ్బండ వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ధర్మసమాజ్ పార్టీ పనిచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారధన్ మహారాజ్ అన్నారు. శుక్రవారం జనగామ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి గొల్లపల్లి చిరంజీవి నామినేషన్ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అగ్రవర్గాల ఆధిపత్యం నానాటికి పేరిగిపోతుందని, పేదలు మరింత పేద వారుగా ధనవంతులు అధిక ధనవంతులు అవుతున్నారని విమర్శించారు.

అన్ని విధాలుగా సహకరిస్తా..



పాలకుర్తి: సీపీఐఎంఎల్ లిబరేషన్ పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా ఎన్నికల అధికారి రోహిత్ సింగ్‌కు శుక్రవారం నామినేషన్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాలకుర్తి సమగ్రాభివృద్ధికి, సామాజిక న్యాయం కోసం తనను గెలిపించాలని కోరారు. ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తానని అన్నారు. జిల్లా కార్యదర్శి సోమయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థికసాయం



జనగామ: పరామర్శిస్తున్న ప్రతాప్‌రెడ్డి



దేవరుప్పుల: పరామర్శిస్తున్న కృష్ణమూర్తి



పాలకుర్తి: నివాళులర్పిస్తున్న ఉషాదయాకర్‌రావు

జనగామ: జనగామ కిసాన్ సెల్ పట్టణ మాజీ అధ్యక్షుడు మోటె శ్రీనివాస్ సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ వేమళ్ళ సత్యనారాయణరెడ్డి, వడ్లకొండ పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల సతీష్, దాసరి క్రాంతి, ఆకుల లక్ష్మయ్య, శ్రీనివాస్, బీరప్ప, రాములు, ప్రవీణ్, మల్లేష్, సాగర్ ఉన్నారు.

ఆర్థికసాయం..

దేవరుప్పుల: మండల కేంద్రంలోని కొత్తకాలనీకి చెందిన భాషిపాక మౌనిక మృతి చెందింది. కాగా శుక్రవారం బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఉప్పుల అనిల్ కుమార్, ఉప్పుల ఉప్పలయ్య, తోటకూరి వెంకన్న, ఆకుల రాములు, లక్ష్మయ్య, నీలరాపు వెంకన్న తదితరులు ఉన్నారు.

పాలకుర్తి: చెన్నూరులో బీఆర్‌ఎస్ నాయకులు మూల యాదయ్య, కారుపోతుల అంజయ్యల అత్తమ్మ మాదాసు లక్ష్మి(70) మృతి చెందింది. కాగా, శుక్రవారం ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, సర్పంచ్ పుస్కూరి పార్వతి రాజేశ్వర్‌రావు, ఎంపీటీసీ కళింగరావు, సహకార సొసైటీ వైస్ చైర్మన్ కారుపోతల వేణు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇంటింటా బీఆర్‌ఎస్ విస్తృత ప్రచారం



దేవరుప్పుల: పాలకుర్తి ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపు కోసం మండల కేంద్రంతోపాటు కడవెండిలో బీఆర్‌ఎస్ మండల పరిశీలకులు బోయినపల్లి మనోహర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా విస్తృత ప్రచారం చేపట్టారు. మండల అధికార ప్రతినిధి హన్మంతు, గ్రామ అధ్యక్షుడు మహేష్, వెంకటేశ్వర్లు, లీనారెడ్డి, నగేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రమేష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఆరునూరైనా బీఆర్‌ఎస్‌దే గెలుపు

కొడకండ్ల: ఆరునూరైనా రాష్ట్రంలో, పాలకుర్తిలో బీఆర్‌ఎస్‌దే గెలుపని ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్య అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుర్తిలో మంత్రి దయాకర్‌రావు చేసిన అభివృద్ధికి ప్రజలు అండగా నిలిచి మరోసారి గెలిపిస్తారని, దళిత, గిరిజనుల పట్ల కాంగ్రెస్ వైఖరి ఎలా ఉంటుందో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సభా వేదికపై వ్యవహరించిన తీరుతో స్పష్టమవుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ జ్యోతి, అభిమన్ గాంధీ, మంగ్యానాయక్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

జనగామలో బీజేపీ జెండా ఎగురుతుంది

బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద బీజేపీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి నామినేషన్‌కు తరలుతున్న వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. మండల ప్రధాన కార్యదర్శి జూకంటి గణేష్, ఉపాధ్యక్షులు పెండెం నాగేష్, పోతుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ద్రోహులకు గుణపాఠం చెప్పాలి

స్టేషన్‌ఘన్‌పూర్: సాధారణ ఎన్నికల్లో తెలంగాణ ద్రోహులకు గుణపాఠం చెప్పాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కాంగ్రెస్ అభ్యర్థి చింత స్వామి అన్నారు. డివిజన్ కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఘన్‌పూర్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమకు నచ్చలేదని, తెలంగాణద్రోహులే ఎన్నికల పోటీలో ఉన్నారన్నారు. తెలంగాణద్రోహులైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు.

బియ్యం కడిగి ఓటు అడిగి

జనగామ రూరల్: బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని మరిగడి గ్రామంలో వినూత్న రీతిలో మండల నాయకుడు ఎడ్ల శ్రీనివాస్ ప్రచారం చేశారు. గ్రామంలోని ఓ వృద్ధుడు వంట చేస్తుండగా బియ్యం కడిగి కేసీఆర్ పథకాలు వివరించి ఓటు వేయమని అభ్యర్థించాడు. ఈకార్యక్రమంలో నాయకుడు నిమ్మల స్వామి, తదితరులు పాల్గొన్నారు.